అదనపు సాయం కొందరికేనా?

- అసంపూర్తి గృహాల లబ్ధిదారులకు ప్రభుత్వ సాయం మంజూరు
- గతంలో అధికారుల ఒత్తిళ్లతో అప్పులు చేసి నిర్మించుకున్న కొందరు
- ప్రస్తుతం వారికి వర్తించకపోవడంపై లబ్ధిదారుల ఆవేదన


పీఎంఏవై కింద చేపట్టిన గృహ నిర్మాణాలు

ఆత్మకూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఆరు జగనన్న కాలనీ లేఅవుట్లను ఏర్పాటు చేశారు. అందులో పీఎంఏవై పథకం కింద 2284 మందికి ప్లాట్లను కేటాయించి గృహాలను మంజూరు చేశారు. కొందరు పునాదుల వరకు, మరికొందరు గోడల వరకు నిర్మాణాలు చేసుకుని అసంపూర్తిగా నిలిపివేశారు. మరికొందరు అప్పులు చేసి నిర్మాణాలను పూర్తి చేసుకున్నారు. అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు లబ్ధిదారులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం అదనపు సాయాన్ని ప్రకటించింది. అయితే అది కొందరికి మాత్రమే వర్తిస్తుండడంతో మిగిలిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల ఒత్తిడితో...

అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు లబ్ధిదారులపై పెద్ద ఎత్తున ఒత్తిడి తెచ్చినా వారు తమ వల్ల కాదంటూ చేతులెత్తేశారు. గృహాలు నిర్మించుకోకపోతే పట్టాలు స్వాధీనం చేసుకుంటామని బెదిరించి కొందరితో బలవంతంగా నిర్మాణాలు పూర్తి చేయించారు. అయితే శ్లాబ్ నిర్మాణం, కొద్దిగా పూత పని చేసిన లబ్ధిదారుల నిర్మాణాలు పూర్తయ్యాయని అధికారులు నిర్ణయించి తలుపులు, కిటికీలు, ఇతర పనులు చేపట్టుకున్నా పూర్తయిన వాటి జాబితాలో కలిపేశారు. అయితే అలాంటి గృహ నిర్మాణాలకు ప్రభుత్వ అదనపు సాయం అందుతుందా..లేదా అని లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తమ లాగిన్‌లో వచ్చిన లబ్ధిదారులకు ఫోన్లు చేసి ఆర్థిక సహాయం మంజూరైన విషయాన్ని చెబుతున్నామని సచివాలయ సిబ్బంది సమాధానమిస్తున్నారు. ఒక సచివాలయం పరిధిలో సుమారు 50 గృహాలు మంజూరైతే కేవలం 10 మంది పేర్లు మాత్రమే లాగిన్‌లో కనిపిస్తుండడంతో మిగిలిన లబ్ధిదారులు తమ పేర్లు వస్తాయా.. లేదా.. అంటూ ఆశగా ఎదురుచూస్తున్నారు.

లబ్ధిదారుల ఆవేదన

కొందరు లబ్ధిదారులు సొంతింటి కలను నెరవేర్చుకోవాలని అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టారు. అయితే ఇళ్లు పూర్తికాకపోవడంతో ఇప్పటికీ అద్దె ఇళ్లలోనే ఉంటున్నారు. ఓ వైపు అద్దె మరోవైపు వడ్డీలు కట్టలేక కుదేలైపోతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రకటించిన అదనపు సాయం కేవలం స్టేజ్ కన్వర్షన్ వారికి మాత్రమేనని గృహ నిర్మాణశాఖ అధికారులు చెబుతుండడంతో అప్పులు చేసిన వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు అదనపు సాయం అందిస్తే కొంత మేర అగచాట్ల నుంచి బయటపడుతామని వాపోతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు అసంపూర్తి గృహాల లబ్ధిదారులకు ఆర్థిక సాయాన్ని బ్యాంకుల ద్వారా చెల్లిస్తున్నాం. మిగిలిన వారి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవహరిస్తాం.

–మోహన్‌రావు, ఈఈ, గృహనిర్మాణశాఖ

అదనపు సాయం అందించాలి



సొంతింటి కలను నిజం చేసుకునేందుకు అప్పులు చేసి మరీ నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నాం. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన అదనపు సాయాన్ని మాకు కూడా అందజేస్తే కొంత వరకు అప్పుల నుంచి బయటపడుతాం. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– షేక్ ఫర్జానా, లబ్ధిదారురాలు

క్లుప్తంగా

పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోండి

వింజమూరు(ఉదయగిరి): పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏస్ఈ వీ విజయన్ అన్నారు. వింజమూరు మండలం లెక్కలవారిపాలెంలో పీఎం సూర్యఘర్ పథకం కింద ఓ వ్యక్తి తన ఇంటిపై ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానల్‌ను శనివారం ఆయన పరిశీలించారు. సూర్యఘర్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం వివిధ కేటగిరీల్లో గరిష్టంగా రూ.75వేల వరకు రాయితీని ఇస్తుందన్నారు. 300 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగం ఉన్న వారు ఒక కిలోవాట్ సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. గృహ అవసరాలకు పోనూ మిగులు విద్యుత్‌ను ఒక యూనిట్‌ను రూ.2.09కు తాము కొనుగోలు చేస్తామని వివరించారు. అనంతరం సబ్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట ఏడీఈ కృష్ణమోహన్, ఏఈ నాగూర్‌వలీ ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఆత్మకూరు: నియోజకవర్గానికి చెందిన పలువురు బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం అందజేశారు. నెల్లూరులోని తన నివాసంలో 47 మందికి రూ.47.84 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆత్మకూరులో ఈ నెలాఖరున 30 ప్రముఖ కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



సీతారామపురం : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తేజస్విని, భాను ప్రసాద్ కుటుంబానికి యూటీఎఫ్ మండల శాఖ నాయకులు శనివారం రూ.31,650 నగదు సాయం అందజేశారు. ఇటీవల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగడంతో విద్యార్థుల కుటుంబం సర్వం కోల్పోయింది. ఈ నేపథ్యంలో ఉదయగిరి, దుత్తలూరు, మర్రిపాడు మండలాల యూటీఎఫ్ నాయకులతో పాటు పాఠశాల విద్యార్థుల సహకారంతో ఆర్థిక సాయం అందజేసినట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎడమ తిరుపతయ్య పేర్కొన్నారు.

వైభవంగా నంది వాహన సేవ



సంగం: స్థానిక కామాక్షిదేవి సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి నంది వాహన సేవను వైభవంగా నిర్వహించారు. పడమటిపాళెంవాసులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

బాధితుడికి చేయూత

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని జీబీకేఆర్ ఎస్టీ కాలనీకి చెందిన కిషోర్‌కు గడ్డం పకీరయ్య శనివారం రూ.10వేలు సాయం అందజేశారు. కిషోర్ రోజువారీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మంచానికి పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో కిషోర్ పోషణ, వైద్యఖర్చుల నిమిత్తం ఆయన భార్య అంజలికి పకీరయ్య నగదు అందజేశారు. దీంతో దాతకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 281

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకు గరిష్ట ధర రూ. 281 పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 531 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 480 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.281, కనిష్ఠంగా రూ. 230, సరాసరిన రూ. 254.02 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి వీ మహేష్‌కుమార్ తెలిపారు.

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం 467 బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 554 బేళ్లు రాగా, 467 బేళ్లను కొనుగోలు చేశామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.230, సగటున రూ.262.46 ధర పలికిందని తెలిపారు.

ల్యాబ్‌టెక్నీషియన్‌ను వేధించడం దారుణం

నెల్లూరు(అర్బన్): జలదంకి పీహెచ్‌సీలో కాంట్రాక్ట్‌పై ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేస్తున్న రసూల్‌కు 18 నెలలుగా జీతం డ్రాచేయకుండా మానసికంగా వేధిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అమరావతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీ రఘుబాబు, ఆర్వీఎస్ఎన్ మూర్తి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రసూల్‌పై వేధింపులను వైద్యశాఖ అధికారులు, ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఈ నెల 7న పీహెచ్‌సీలో విచారణ చేపట్టారని తెలిపారు. ఇబ్బందులు తలెత్తిన చోట రసూల్ పనిచేసే పరిస్థితి ఉండదని, అతని ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని బదిలీ చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఇంటర్ విద్యార్థులకు అభినందనలు


పూజితను అభినందిస్తున్న రామిరెడ్డి దంపతులు


శ్రావ్యను అభినందిస్తున్న స్థానికులు

కావలి: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభకనబర్చిన వినుకొండ పూజితను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు శనివారం అభినందించారు. సాధారణ డ్రైవర్ ప్రసాద్ కుమార్తె పూజిత ఎంపీసీలో 990 మార్కులు సాధించడం అభినందనీయమని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులో గణపం బాలకృష్ణారెడ్డి గిరిజన కాలనీకి చెందిన నిరుపేద ఎస్టీ విద్యార్థి యాకసిరి శ్రావ్య ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీలో 960 మార్కులు సాధించిన నేపథ్యంలో స్థానిక పెద్దలు జూపల్లి రాజారావు, వసంత, మహేష్, తదితరులు అభినందించారు. బాలికకు చదువు మీద ఉన్న మమకారాన్ని గమనించిన తండ్రి బొగ్గుబట్టి పనులు చేస్తూ చదివించడం అభినందనీయమన్నారు. బాలిక ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందజేస్తామని భరోసా ఇచ్చారు.

పలువురికి రామిరెడ్డి పరామర్శ


కల్యాణిని పరామర్శిస్తున్న రామిరెడ్డి

కావలి: పట్టణంలోని 39వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు వెంగలశెట్టి కళ్యాణి మామ ఇటీవల మరణించిన నేపథ్యంలో వాయునందన ప్రెస్‌రోడ్‌లోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శనివారం పరామర్శించారు. అలాగే కావలి మండలం సర్వాయపాళెం పంచాయతీ మాతినవారిపాళేనికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కోరా తిరుపతి మనుమడు ఇటీవల మరణించడంతో వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఇటీవల మరణించిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మన్నెం తిరుపతి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన సర్వాయిపాళెం సర్పంచ్ ఇస్సారపు యానాది అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేత దామిశెట్టి సుధీర్ నాయుడు, తదితరులు ఉన్నారు.

ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ పొడిగింపు

అల్లూరు: ప్రభుత్వం ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీని ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్ను బకాయిలను ఒకేసారి ఏకమొత్తంలో చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీని కల్పిస్తున్నట్లు చెప్పారు. నగర పంచాయతీ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పన్ను బకాయిలను చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ


చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ఆత్మకూరు(చేజర్ల): చేజర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్ష ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ లక్ష్మీరెడ్డి తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎస్ ఎలీషా 953, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో మహేంద్ర 432 మార్కులతో టాపర్లుగా నిలిచారని వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సుకుమార్, అధ్యాపకులతో కలిసి అభినందించారు.


కె అనిత ఎన్ నాగశ్రీ

మర్రిపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్‌లో 75శాతం, జూనియర్ ఇంటర్‌లో 43 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్‌లో కే అనిత 944, జూనియర్ ఇంటర్‌లో పీ జాహ్నవి 454 మార్కులతో టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపల్ విజయలక్ష్మి తెలిపారు.

సంగం: స్థానిక గురుకుల పాఠశాలకు చెందిన ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారని ప్రిన్సిపల్ సుమతి తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 80 మందికి 62 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. జూనియర్ ఎంపీసీలో ఎం అక్షర 429, బైపీసీలో ఎం వైష్ణవి 423 మార్కులు సాధించారని చెప్పారు. సీనియర్ ఇంటర్‌లో 68 మందికి, 66 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఎంపీసీలో బీ శ్రావణి 923, బైపీసీలో కె స్పందన 936 మార్కులు సాధించారని వివరించారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థుల సత్తా


బీ ప్రణీత సంగీత

కలిగిరి: స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారని ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీను తెలిపారు. సీనియర్ ఇంటర్ బైపీసీలో బీ ప్రణీత 965, ఎంపీసీలో మోహనసంగీత 943, సీఈసీలో హెప్సిబా 726 మార్కులతో టాపర్లుగా నిలిచారని వివరించారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో లక్ష్మీ ప్రియాంక 437, బైపీసీలో మహేశ్వరి 386, సీఈసీలో మనీష్ 378 మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.


పవిత్ర ఎలిజబెత్


నాగశాలిని

సీతారామపురం: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో నూరుశాతం, ప్రథమ సంవత్సరంలో 68 శాతం ఉత్తీర్ణత సాధించినట్లుగా ప్రిన్సిపల్ ముజిబుల్ రెహమాన్ తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో బైపీసీలో పవిత్ర 955, నాగశాలిని 815, ఎంపీసీలో ఎలిజిబెత్ 941 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో అఖిల్ 424, బైపీసీలో శ్రుతి 419, సీఈసీలో సోనుకుమార్ 385 మార్కులు సాధించారు.

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ


శ్రీజ గురుచిన్మయి

దుత్తలూరు: నందిపాడులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ ఎం అంజనీదేవి తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీలో 31 మందికి గానూ 30 మంది, ద్వితీయ సంవత్సరం బైపీసీలో 25 మందికి గానూ 22 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ప్రథమ సంవత్సరంలో జీవీ శ్రీజ 422, ద్వితీయ సంవత్సరంలో కే గురుచిన్మయి 924 మార్కులతో టాపర్లుగా నిలిచారని తెలిపారు. అలాగే దుత్తలూరులోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 128 మందికి గానూ 77 మంది, ద్వితీయ సంవత్సరంలో 68 మందికి గానూ 44 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపల్ జే సైమన్ రావు తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో బీ వైష్ణవి 454, ద్వియతీ సంవత్సరం ఎంపీసీలో మీసాల లిఖిత 955 మార్కులతో టాపర్లుగా నిలిచారని వివరించారు.

అనుమసముద్రంపేట: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 77.14 శాతం, ద్వితీయ సంవత్సరంలో 96.15 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపల్ బీ శ్రీలక్ష్మమ్మ తెలిపారు. బైపీసీలో ప్రథమ సంవత్సరంలో డీ వెన్నెల 427, ద్వితీయ సంవత్సరంలో బీ వెంకట సూర్యప్రియ 932 మార్కులతో టాపర్లుగా నిలిచారని వివరించారు.

కొండాపురంలో 73శాతం ఉత్తీర్ణత

కొండాపురం : ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మండలంలోని విద్యార్థులు 73శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆదర్శ పాఠశాలలో ప్రథమ సంవత్సరంలో 89మందికి 39 మంది, ద్వితీయ సంవత్సరంలో 89 మందికి 85మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో ప్రథమ సంవత్సరంలో బీ రమ్య 443, ద్వితీయ సంవత్సరంలో ఎస్ విష్ణుప్రియ 888 మార్కులతో టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా తెలిపారు. కేజీబీవీ విద్యాలయంలో ప్రథమ సంవత్సరంలో 33మందికి 27మంది, ద్వితీయ సంవత్సరంలో 24మందికి 23 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో ప్రథమ సంవత్సరంలో ఎస్ లావణ్య 406, ద్వితీయ సంవత్సరంలో బీ కావ్య 924 మార్కులతో టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపల్ టీ జయంతి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 66 మందికి 33మంది, ద్వితీయ సంవత్సరంలో 87 మందికి 60మంది ఉత్తీర్ణత సాధించారు. డీ మణిదీప్ 906 మార్కులతో టాపర్‌గా నిలిచాడని పిన్సిపల్ శ్రీహరి తెలిపాడు.

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 127 మందికి గానూ 122 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ప్రథమ సంవత్సరంలో 180 మందికి గానూ 175 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో సయ్యద్ లతీఫా, వీ కృష్ణవేణి 963, ఎంపీసీలో ఎం నందిని 946, హెచ్‌ఈసీలో బీ శశి 925 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. వీరిని ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

వశిష్ట విద్యార్థుల విజయకేతనం


పూజిత చౌదరి(466)

కావలి: పట్టణంలోని శ్రీవశిష్ట జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారని ఆ కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో కే లక్ష్మీహరిత (991), ప్రథమ సంవత్సరంలో వై పూజితచౌదరి 466, బైపీసీలో ద్వితీయ సంవత్సరంలో పీ అక్షితవర్ష 986, ప్రథమ సంవత్సరంలో బీ జ్ఞా నేశ్వరి 428 టాపర్లుగా నిలిచారు. సీఈసీలో ప్రథమ సంవత్సరంలో కే శ్రీవాణి 484, ద్వితీయ సంవత్సరంలో జీ సాయిమృదుల 940, ఎంఈసీలో ప్రథమ సంవత్సరంలో వీ రత్నసిరిరెడ్డి 480 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు.

శ్రీచైతన్య విద్యార్థుల హవా


టాపర్లను అభినందిస్తున్న ప్రిన్సిపల్

పట్టణంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో తమ హవాను చాటారు. బైపీసీలో సీనియర్ ఇంటర్‌లో పీ కృష్ణసౌజన్య 988, జూనియర్ ఇంటర్‌లో జీ ధనుష్క 433, ఎంపీసీలో సీనియర్ ఇంటర్‌లో ఎం శివకృష్ణ 987, పీ యశ్వంత్ 986, పీ మీనారుక్సేసర్ 986, పీ శ్రీవర్షణి 985, జూనియర్ ఇంటర్‌లో ఎస్డీ సాజిదా 465, ఎం దివ్యవాణి 464, ఆర్ లక్ష్మీసుహిత 463, ఎం నిషిత 463 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. బైపీసీ సీనియర్ ఇంటర్‌లో పీ కృష్ణసౌజన్య 988, ఎస్ నాగచందన 981, జీ ధనుష్క 433, ఎం నిషిత 427, టీ దీపిక 424 మార్కులను సాధించారు. సీఈసీలో సీనియర్ ఇంటర్‌లో ఎస్ పూజిత 944, జూనియర్ ఇంటర్‌లో ఎం రహిత సంజనా 477, ఆర్ హారిక 470 మార్కులు సాధించారు. కాగా టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందించారు.

గీతాంజలి విద్యార్థుల ప్రతిభ


రాజ్యలక్ష్మి

పట్టణంలోని గీతాంజలి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభకనబరిచారని ఆ కళాశాల యాజమాన్యం పేర్కొంది. సీనియర్ ఇంటర్‌లో సీఈసీలో ఎం రాజ్యలక్ష్మి 946, హెచ్‌ఈసీలో ఏ సురేఖ 901, ఎంపీసీలో జేవీ జనార్దన్‌రెడ్డి 955, జీ ఉషశ్రీ 940, కే రేవతి 910 మార్కులు సాధించారు.

ఎల్వీఆర్ విద్యార్థుల విజయకేతనం


షేక్ అసిన్ శ్రీలక్ష్మి బిస్మిల్లా భాను

సీతారామపురం : స్థానిక ఎల్వీఆర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో షేక్ అసిన్ 977, షేక్ బిస్మిల్లాభాను 974, శ్రీలక్ష్మి 967 మార్కులతో టాపర్లుగా నిలిచారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో సీహెచ్ ప్రవంతి 450, నవ్యశ్రీ 447, షేక్ ఖలీల్ 446 మార్కులతో టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపల్ కొండా శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

ప్రియదర్శిని విద్యార్థుల విజయదుందుభి


బీ హర్షిత బీ విష్ణువర్ధన్

ఆత్మకూరు: పట్టణంలోని ప్రియదర్శిని కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయదుందుభి మోగించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో బీ హర్షిత 990, ఎం విష్ణువర్ధన్‌రెడ్డి 988, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో కే భానుశ్రీ 465, బైపీసీలో సీహెచ్ లహరి 433 మార్కులతో టాపర్లుగా నిలిచారని నిర్వాహకులు తెలిపారు.

నేతాజీ వికాస్, వివేకానంద విద్యార్థుల హవా

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని నేతాజీ, వివేకానంద కళాశాలల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో హవా చాటారు. నేతాజీ వికాస్‌లో సీనియర్ ఇంటర్ ఎంపీసీలో సీహెచ్ జశ్వంత్, పోలు భవ్యశ్రీ 985 మార్కులతో టాపర్లుగా నిలిచారని కరస్పాండెంట్ రత్నం తెలిపారు. అలాగే వివేకానంద కళాశాలలో సీనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థి వెంకట నందకిషోర్ 985 మార్కులతో టాపర్‌గా నిలిచాడని కరస్పాడెంట్ మద్దూరి గోపాల్‌రెడ్డి తెలిపారు.

శ్రీచైతన్య విద్యార్థుల విజయభేరి


అల్లూరు: ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీచైతన్య విద్యార్థులు

అల్లూరు: స్థానిక శ్రీచైతన్య ఆర్ట్స్ ఆండ్ సైన్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయభేరి మోగించారని కరస్పాండెంట్ కే శివకుమార్ తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో లక్ష్మీజాగృతి 985, పూజిత 984, వైష్ణవి 984, బైపీసీలో సాయిలాస్య 980, నందిని 971, జీవన్ కుమార్ 955, సీఈసీలో ఖలీద్‌ఆఫ్రిన్ 898 మార్కులు సాధించారని చెప్పారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో హేమంత్‌కుమార్ 459, గౌతమి 456, మాధవి 456, బైపీసీలో శ్రీలక్ష్మి 418, వెంకటతేజస్వి 398, శ్రావ్య 391, సీఈసీలో అలేఖ్య 418 మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ శివకుమార్, డైరెక్టర్ ఖాజారహ్మతుల్లా, అధ్యాపకులు అభినందించారు.

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణోత్సవం

వరికుంటపాడు: స్థానిక కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శనివారం నేత్రపర్వంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

15న సామాజిక తనిఖీ ప్రజావేదిక

వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 15న ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీ వేణుగోపాల్‌రావు శనివారం ఒక ప్రకటన తెలిపారు. ఉపాధి సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

పాముకాటుతో ఉపాధి కూలీకి అస్వస్థత

జలదంకి: పాముకాటుతో ఉపాధి కూలీ అస్వస్థతకు గురైన ఘటన మండలంలోని వేములపాడులో శనివారం చోటు చేసుకుంది. వేములపాడుకు చెందిన కోడూరు రామలక్ష్మమ్మ శనివారం ఉదయం ఉపాధి హామీ పథకం కింద వాగులో చేపడుతున్న పూడికతీత పనులకు వెళ్లింది. అక్కడ పని చేస్తుండగా పాము కాటు వేసింది. సహచర కూలీలు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఏపీఓ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్ రంగారెడ్డి ఏరియా వైద్యశాలకు వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

క్వాలిటీ కంట్రోల్ అధికారుల పరిశీలన

జలదంకి: మండలంలోని గట్టుపల్లి, చింతలపాళెం గ్రామాల్లోని ప్రభుత్వ లేఅవుట్లను రాష్ట్ర చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపీచంద్, జిల్లా సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్‌బాబు శనివారం పరిశీలించారు. చింతపాళేనికి చెందిన గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు తాను ప్రభుత్వ లేఅవుట్లలో లెవలింగ్, గ్రావెల్ తోలకం పనులు చేపట్టగా ఇంతవరకు బిల్లులు మంజూరు చేయలేదని కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు క్వాలిటీ కంట్రోల్ అధికారులు రెండు లేఅవుట్లలో లెవలింగ్ పనులను కొలతలు వేశారు. నివేదికలను పై అధికారులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

రోడ్లపైకి ఆవులను వదిలితే చర్యలు

అల్లూరు: రోడ్లపైకి ఆవులను వదిలితే చట్టపరమైన చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం అల్లూరులో ఆవు దాడిలో నలుగురికి గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నగర పంచాయతీ పరిధిలోని ఆవులను నగర పంచాయతీ సిబ్బందితో శనివారం ఊరిబయటకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవులను ఇళ్లలోనే కట్టేసుకోవాలని, ఇకపై రోడ్లపైకి ఆవులను వదిలితే గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు. జరిమానా చెల్లించి విడిపించుకోవాల్సిన పరిస్థితులు ఉంటాయని తెలిపారు.

తొమ్మిది మద్యం సీసాలు స్వాధీనం

జలదంకి: మండలంలోని గట్టుపల్లిలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నీలం చిన్నయ్య వద్ద నుంచి 9 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

కట్నం కోసం వేధింపులపై ఫిర్యాదు

కావలి: ప్రేమ వివాహం చేసుకుని రెండేళ్ల పాటు కాపురం చేసిన అనంతరం కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్న భర్తపై భార్య ఒకటో పట్టణ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. వివరాలు.. పట్టణంలోని పాతూరుకు చెందిన వేలమూరి వెంకటగాయత్రి తన సోదరుడితో కలిసి జిమ్‌కు వెళ్తుండేది. అక్కడ తన సోదరుడి స్నేహితుడైన లత సినిమా థియేటర్ మేనేజర్ గునపాటి అజయ్‌రెడ్డితో ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఈ క్రమంలో ఇంటి నుంచి వెళ్లిపోయి ఇద్దరు రిజిస్టర్ వివాహం చేసుకున్నారు. ఆ తరువాత గాయత్రి, అజయ్‌రెడ్డి నెల్లూరులో కాపురం పెట్టారు. అయితే భర్త, అత్త, మామలు కలిసి కట్నం తీసుకురమ్మని గాయత్రిని వేధించడం మొదలు పెట్టారు. వేధింపులు తారాస్థాయికి చేరడంతో తట్టుకోలేక శనివారం కావలికి చేరుకుని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధార్ అనుసంధానంతో గృహాలు మంజూరు

ఆత్మకూరురూరల్: పీఎంఏవై 2.0కు సంబంధించిన గృహాల మంజూరులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు ఆధార్‌కార్డులను అనుసంధానం చేసుకోవడం ద్వారా పొందవచ్చని గృహ నిర్మాణ శాఖ ఏఈ శరత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఆధార్‌కు సంబంధించి పొరపాటుగా నమోదైన వివరాల కారణంగా నిజమైన లబ్ధిదారులకు గృహాల మంజూరులో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రస్తుతం ఆధార్‌లోని తప్పులను సరిచేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. వివరాలకు 97053 32423 నంబరులో సంప్రదించాలని కోరారు.